నీటి సరఫరాలో నిర్లక్ష్యం తగదు



స్థానికులతో మాట్లాడుతున్న నవజీవన్‌రెడ్డి

లింగోజిగూడ: నీటి సరఫరాలో జలమండలి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం తగదని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ పరిధి రాఘవేంద్ర నగర్ కాలనీలో గత కొంత కాలంగా నీటి సరఫరా సరిగ్గా లేదని కార్పొరేటర్ దృష్టి రావడంతో శనివారం ఆయన కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆటోలు కూడా కాలనీలకు రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే చర్యలు తప్పవన్నారు. కార్పొరేటర్ వెంట హరినాథ్‌బాబు, సంఘీ అశోక్, శేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణరావు, హేమంత్ ఉన్నారు.

'రైతు పండుగ'కు తరలిన కాంగ్రెస్ నాయకులు



తరలివెళ్తున్న నాయకులు

లింగోజిగూడ: మహబూబ్‌నగర్ అమిస్తాన్‌పూర్‌లో నిర్వహించిన రైతు పండుగకు జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కందికంటి శ్రీధర్‌గౌడ్, యశ్వంత్‌రెడ్డి, పీ.శ్రీధర్‌గౌడ్, గోవర్దన్, సుధీర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మనోజ్, రోహిత్‌రెడ్డి, నరేందర్, శ్రీనాథ్ రావు, శివగౌడ్ విష్ణు, జనార్ధన్, చిన్నరెడ్డి, రవి పాల్గొన్నారు.

'118జీఓ తీసుకొచ్చి మోసం చేశారు'



మాట్లాడుతున్న ఐక్యవేదిక సభ్యులు

ఎల్‌బీనగర్: గత 15 ఏళ్ల నుంచి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో ఇళ్ల రిజిస్ట్రేషన్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని, గత ప్రభుత్వం తీసుకొచ్చిన 118 జీఓతోనైన తాము లబ్ధి పొందాలని అనుకున్న ఇచ్చిన జీఓలో చట్టబద్ధత లేక నిరాశకు గురయ్యామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ జీఓ 118 బాధితుల ఐక్యవేదిక సభ్యులు ఆరోపించారు. శనివారం సాగర్ కాంప్లెక్స్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. నిషేధిత సెక్షన్ 22-ఏను తీసేయకుండా జీఓ తీసుకు రావడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో సుమారు నాలుగు వేల ఇళ్ల యజమానులు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల పైచదువులకు బ్యాంకుల నుంచి రుణాలు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా జీఓలో మార్పులు తీసుకొచ్చి ఇళ్ల రిజిస్ట్రేషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, పెంటారెడ్డి, రవింధర్‌రెడ్డి, మహేంధర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెట్టింపు ఆదాయమంటూ.. రూ.1.29 లక్షల టోకరా

నాగోలు: ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చే యాడ్ చూసి ఓ యువతి రూ.1.29 లక్షలను పోగొట్టుకున్న ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్‌బీనగర్‌లో నివాసముంటున్న మౌనిక (23) ఈ నెల 28న ఇన్‌స్టాలో రీల్స్ చూస్తుండగా మధ్యలో ఓ యాడ్ వచ్చింది. ఇంట్లోనే కూర్చుని పెన్సిల్ ప్యాకింగ్ ద్వారా రెట్టింపు ఆదాయం పొందవచ్చనే ప్రకటనకు స్పందించి అక్కడున్న నంబర్‌ను సంప్రదించింది. ప్రకటన ఇచ్చిన వ్యక్తి రిజిస్ట్రేషన్ కోసం రూ.620 పంపమని చెప్పడంతో మౌనిక క్యూఆర్ కోడ్‌కు ఆ డబ్బును పంపింది. ఆ తర్వాత రూ.2 వేలు పంపింది. పలుమార్లు రెట్టింపు ఆదాయం వచ్చినట్లు ఆశ చూపి ఈ సారి రూ.1.29 లక్షలు పంపితే అధిక డబ్బులు వస్తాయని నమ్మించడంతో ఆ మొత్తాని పంపించింది. ఆ తర్వాత ఎలాంటి స్పందన రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసింది.

పదవీ విరమణ సంతోషాన్నిస్తుంది



డాక్టర్ మీర్జాఅలీబేగ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సూరేపల్లి నంద

సైదాబాద్: విధులను సమర్ధవంతంగా నిర్వహించామన్న సంతృప్తితో చేసే పదవీ విరమణ సంతోషాన్నిస్తుందని జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మీర్జాఅలీబేగ్ పేర్కొన్నారు. శనివారం సైదాబాద్ జైల్‌గార్డెన్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆయన పదవీ విరమణ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద పాల్గొని మాట్లాడారు. సమాజ నిరాదరణకు గురై వీధుల్లో తచ్చాడుతూ ప్రభుత్వ సదనంలో ఆశ్రయం పొందే బాలలను తీర్చిదిద్దే బాధ్యత అధికారులదే అన్నారు. పలు క్రీడాంశాల్లో ఇక్కడి బాలలు రాణించడానికి మీర్జాఅలీబేగ్ చేసిన కృషి అమోఘమన్నారు. సంస్థ డైరెక్టర్ కాంతి వెస్లీ మాట్లాడుతూ.. సదనంలోని బాలల సంస్కరణలో మీర్జాఅలీబేగ్ తనదైన ముద్ర వేశారని కొనియాడారు. అనంతరం హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద ఆయనకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ కిస్మత్‌కుమార్, సుకుమార్, రాంచంద్రమూర్తి, కేశవులు, చర్వాక్, నవీన్‌కుమార్, గోపికుమార్, జ్వాల, నాగేశ్వరరావు, అఫ్జల్ పాల్గొన్నారు.

రహదారులే పార్కింగ్ స్థలాలు!

అంతర్గత కాలనీల్లో అక్రమ పార్కింగ్

- ఇరువైపులా వాహనాల నిలిపివేత
- కుంచించుకుపోతున్న రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



సైదాబాద్ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా..



హౌజింగ్ బోర్డ్ కాలనీలో కనీసం బైక్ వెళ్లలేని స్థితిలో పార్కింగ్

సైదాబాద్: కాలనీలు, బస్తీల్లో ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో రోడ్డంతా కుంచించుకుపోవడంతో పాటు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా కాలనీలవాసులు వాపోతున్నారు. అసలే ఇరుకుగా ఉండే కాలనీల్లోని రహదారులపై కొందరు పదుల సంఖ్యల్లో వాహనాలను నిలుపుతుండటంతో ఎంతో మందికి ఇబ్బందులకు గురి చేస్తోంది. సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీల్లో నిత్యం అక్రమ పార్కింగ్‌తో సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని సమయాల్లో వాహనదారులు నడుమ వాగ్వాదాలతో పాటు పరస్పర దాడులు సైతం చేసుకున్న ఘటనలు ఉన్నాయి.

ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ జామ్

సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలకు చెందిన వారు ప్రధాన రహదారులపైకి చేరుకునేందుకు వెళ్లే మార్గాల్లోని అంతర్గత రహదారులపై ఇరువైపులా తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండటం సమస్యలకు కారణమవుతుంది. సాధారణంగా అంతర్గత రహదారులు చిన్నవిగా ఉంటాయి. వాటిపై రెండు వైపులా కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతున్నారు.దీంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. అక్రమ పార్కింగ్‌తో ఒక వాహనం నిలిచిపోతే వెనుక వచ్చే మరిన్ని వాహనాలు స్తంభించి హారన్‌లతో హోరెత్తిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల వాహనాలు, ఆటోలు, తమ వాహనాలపై వెళ్లే ఉద్యోగులు అంతర్గత కాలనీల్లో అక్రమ పార్కింగ్‌లతో నరకం అనుభవిస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతర్గత కాలనీల్లో పలు వ్యాపారాలు నిర్వహించే దుకాణదారులు తమ షాపుల ముందు వినియోగదారులు వాహనాలను నిలుపకుండా దృష్టి పెట్టాలి. ఒకే చోట ఇరువైపులా వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడటానికి అవకాశం ఉంటుంది. దుకాణదారులు తమ షాపుల ముందు నో పార్కింగ్ సైన్ బోర్డ్‌లను ఏర్పాటు చేసుకోవాలంటున్నారు.

ట్రాఫిక్ పోలీసుల నిఘా లేక..

ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడైనా కాలనీల్లోని అంతర్గత రహదారులపై దృష్టి పెట్టాలి. తరచూ ట్రాఫిక్ జామ్ అవుతున్న కాలనీల్లోని రహదారులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి. అక్రమ పార్కింగ్ చేసిన వాహనాలపై జరిమానాలు విధించాలని స్థానికులు కోరుతున్నారు. ఇలా చేస్తే మరోసారి వాహనాలను పార్కింగ్ చేయరని అభిప్రాయపడుతున్నారు. సైదాబాద్, ఐఎస్‌సదన్ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలవాసులు తమ ప్రాంతాలలో అక్రమ పార్కింగ్ విషయమై ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఆయా కాలనీల్లోని అక్రమ పార్కింగ్‌పై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ పోలీసులు దృష్టి పెట్టాలి..



కాలనీల్లోని అంతర్గత రహదారులు గతంలో ఎంతో ప్రశాంతంగా ఉండేవి. ఇటీవల ఆయా రహదారులపై అక్రమ పార్కింగ్ కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అత్యవసర పనులకు వెళ్లే వారు అక్రమ పార్కింగ్‌ల కారణంగా సమయానికి వెళ్లలేక వేదనకు గురవుతున్నారు. వాహనదారులు తమ వాహనాలను ఇష్టారాజ్యంగా రహదారులపై నిలిపి ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. ఈ సమస్యపై స్థానిక ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– లక్ష్మణ్ ఠాకూర్, సైదాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి

వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి వద్ద..

వనస్థలిపురం: వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి గేటు ముందు ఆటోల అడ్డగోలు పార్కింగ్‌లతో ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి గేటు సమీపంలో ఓ టీ కొట్టును ఏర్పాటు చేయడం, అలాగే ఆ రోడ్డులో అడ్డగోలుగా ఆటోలను పార్కింగ్ చేస్తుండడంతో అక్కడికొచ్చే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శనివారం ఆసుపత్రికి వచ్చిన ఓ వాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో అందులో ఉన్న గర్భిణి గాయపడింది. ట్రాఫిక్ పోలీసులు, ఆసుపత్రి సమీపంలో అక్రమ పార్కింగ్, ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించే టీ కొట్టు, తోపుడు బండ్లను అక్కడి నుంచి తరలించేలా చర్యలు తీసుకోవాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు.



మలక్‌పేట గంజ్‌లో అన్నదానం



ఇన్‌స్పెక్టర్ రాజును సన్మానిస్తున్న సంఘం నాయకులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట గంజ్‌లో ప్రతీ అమావాస్య రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు అన్నారు. శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గంజ్‌లో కార్మికులు, హమాలీలు, చాట్ కూలీలు పని చేస్తుంటారని వారందరిని దృష్టిలో పెట్టుకొని ప్రతి అమావాస్య అన్నదానం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఇన్‌స్పెక్టర్‌ను సన్మానించారు.

బస్తీల సమగ్రాభివృద్ధికి కృషిచేస్తా



సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని బస్తీల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీ రోడ్ నం-13లో రెండు బోర్‌వెల్స్ ఏర్పాటు పనులను శనివారం కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి కాలనీ గుడిసెలకు తాగునీటిని వాటర్‌వర్క్స్ అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారని కానీ.. రోజువారి వాడుక నీటికి ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి రావడంతో సంబంధిత అధికారులతో చర్చించి బోర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జంగం మధుకర్‌రెడ్డి, బస్తీవాసులు శివకుమార్, నాగరాజు, అశోక్, సాయి, శివ, లీల, వేణు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

లింగోజిగూడ: ప్రభుత్వం పాఠశాలలు, ఆశ్రమలు, గురుకులాల్లోని సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విద్యార్థి సంఘాలు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు ఆరోపించారు.ఫుడ్ పాయిజన్, విద్యార్థుల సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శనివారం ప్రభుత్వ పాఠశాలల బంద్ నిర్వహించారు.హయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బంద్ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. హాస్టళ్లలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గుండె శివ, పీడీఎస్‌యూ హయత్‌నగర్ మండల కార్యదర్శి మహేష్, నాయకులు బొంగు అరుణ్‌కుమార్, వినోద్, వెంకటేష్, ఉపేందర్, భానుప్రకాశ్, శివ, వంశీ, సాయి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

నాగోలు: రోడ్డును ఆక్రమించి అనుమతులు లేకుండా నిర్మించిన రెండు ఇళ్లను జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసుల బందోబస్తు నడుమ కూల్చివేశారు. నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీ సమీపంలోని మల్లికార్జున్ హిల్స్ కాలనీలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పోయే దారిలో రోడ్డును ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయమై కాలనీవాసులు పలుమార్లు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేయగా ఎట్టకేలకు శనివారం హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ విజయలక్ష్మి, టీపీఎస్ అక్బర్, ఇతర సిబ్బందితో వచ్చి కూల్చివేతలు చేపట్టారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



లింగోజిగూడ: డివిజన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి రూ.34 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మరి కొన్ని కాలనీల్లో సమస్యలు ఉన్నాయని వాటికి కూడా నిధులు మంజూరు చేయాలని కోరడంతో ఎండీ సానుకూలంగా స్పందించాలరన్నారు.

- సరూర్‌నగర్ పోస్టాఫీస్ నుంచి లింగోజిగూడ ఓల్డ్ విలేజ్ వెళ్లే రోడ్డు నిర్మాణం రెండు మూడు రోజుల్లో ప్రారంభిస్తామని కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.శనివారం ఏఈ విజయ్, స్థానికులతో కలిసి రోడ్డును పరిశీలించి మాట్లాడారు. ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

నాగోలు ఎస్‌టీపీ పరిశీలన

నాగోలు: నాగోలు డివిజన్ పరిధి జైపురికాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన సీవరేజీ ఎస్‌టీపీని శనివారం జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాయాంక్ మిట్టల్ పరిశీలించారు. ఈ నెల 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదగా నాగోలు ఎస్‌టీపీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మాయాంక్ మిట్టల్ ఎస్‌టీపీలో జరుగుతున్న పనులను పరిశీలించి మిగిలిన వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

నేడు దివ్యాంగ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

చాదర్‌ఘాట్: డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో ఆదివారం దివ్యాంగ ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు షేక్ హబీబ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనంలో వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యకు సన్మానం ఉంటుందని అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతుబజార్‌లో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.43, వంకాయ రూ.35, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.31, క్యారెట్ రూ.47, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.54, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.27, సొరకాయ రూ15, పొట్లకాయ రూ.23.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీనియర్ సిటిజన్స్

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధి అగ్రికల్చర్‌కాలనీలో నిలిచిపోయిన సీనియర్ సిటిజన్ భవనానికి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కాలనీ సీనియర్ సిటిజన్ సభ్యులు శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్ సిటిజన్ భవనానికి కేవలం స్లాబ్ వేయడం జరిగిందని, మిగతా పనులు పూర్తి చేసేందుకు రూ.80 లక్షలు అవసరమని వాటి మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నారు. డివిజన్ పరిధిలోని ఖాద్రీకాలనీలో సీసీ రోడ్లను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా రోడ్డు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధంచేసి నిధులను మంజూరు చేయించి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రమావత్ శ్రీనివాస్ నాయక్, గోదల రఘుమారెడ్డి, హరివర్ధన్, అల్వాల్‌రెడ్డి, మణిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి

- ఎమ్మెల్యే బలాల



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: పార్టీలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్‌బలాల అన్నారు. మూసారంబాగ్‌లోని ఆరోరా కాలేజ్, శాలివాహననగర్, సాయినగర్, ఇందిరానగర్, ఇందిరానగర్ కమాన్ లైన్, గడ్డిఅన్నారం బస్తీ దవాఖానా, సలీంనగర్ ఫర్హాత్ నర్సింగ్ హోమ్, సలీంనగర్ బస్తీ దవాఖానా ప్రాంతాల్లో శనివారం ఆయన పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. డివిజన్‌లో సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ, వాటర్ పైపులైన్ తదితర పనులకు రూ.1.5 కోట్లు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, జీహెచ్‌ఎంసీ డీఈఈ శంకర్, ఏఎంహెచ్‌ఓ అనురాధా, వాటర్ వర్క్స్ డీజీఎం హస్మత్‌అలీ, నాయకులు కనుకల రవీందర్ రెడ్డి, తుమ్మల బాల్‌రెడ్డి, ఇలియాస్, సాయి చైతన్య కాలేజ్ ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, న్యూనోబుల్ కాలేజ్ ఇన్‌చార్జి చంద్రయ్య పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి..

మలక్‌పేట: మలక్‌పేటలోని పీపుల్ విత్ హియరింగ్ ఇంపైర్డ్ నెట్‌వర్క్(ఫిన్) సంస్థ ప్రతినిధులు శనివారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలను కలిశారు. 120 మంది బధిర విద్యార్థులు చదువుకుంటున్న ఫిన్ సంస్థకు సొంత భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సంస్థకు ప్రభుత్వ స్థలం కేటాయించేలా చొరవ చూపాలని డైరెక్టర్ వి.జానకి, జనరల్ సెక్రటరీ బాలకృష్ణారెడ్డి బధిర విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా ఇవ్వాలి

- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు



ఆర్డర్ కాపీని అందజేస్తున్న సీపీ సుధీర్‌బాబు

నాగోలు: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తూ సవాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. నూతనంగా విధుల్లో చేరనున్న కానిస్టేబుళ్లకు శనివారం నాగోలులోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దిశానిర్దేశం చేశారు. రాచకొండ నుంచి 265 సివిల్, 466 ఏఆర్ కలిపి మొత్తం 731 మంది ఎంపికై 9 నెలల కఠినమైన శిక్షణ పూర్తి చేసుకుని వివిధ స్టేషన్లకు కేటాయించబడ్డారన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పని చేయడం అనేది ప్రజలకు అత్యంత చేరువగా ఉంటూ సేవ చేసే గొప్ప అవకాశమన్నారు. పోలీసు శాఖలో ఏ హోదాలో ఉద్యోగంలో చేరినప్పటికీ ప్రతి ఒక్కరూ శాంతిభద్రతల పరిరక్షణలో సమాప్రాధాన్యం, బాధ్యత కలిగి ఉంటారన్నారు. నూతన కానిస్టేబుళ్లకు ఉన్నతాధికారుల నుంచి సంపూర్ణ సహాయ సహకారాలు అందుతాయని స్టేషన్‌కు వచ్చే బాధితులకు భరోసా ఇవ్వాలన్నారు. పెరుగుతున్న సైబర్ క్రైమ్ వంటి సాంకేతికపరమైన నేరాల నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వారిని సైబర్ క్రైమ్, ఐటిసెల్ వంటి విభాగాల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు పద్మజ, ప్రవీణ్ కుమార్, రాజేష్ చంద్ర. సునీత, అరవింద్ బాబు, రమణారెడ్డి, శ్రీనివాసులు, ఉషా విశ్వనాథ్, మనోహర్, మురళీధర్, అడిషనల్ వెంకట్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ శ్యాంసుందర్, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య పాల్గొన్నారు.